క్లుప్తంగా

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

అనపర్తి: ముచ్చటైన తెలుగు భాషకు, అచ్చమైన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజకవర్గ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని ప్రతి ఇంటా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ వద్ద సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్డును ఆనుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు, వార్డు మెంబర్ శ్రీనివాస్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం వాహనచోదకులకు, పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నానని, ప్రతి రోజూ చల్లని నీరు పంపిణీ చేస్తామన్నారు. ఎండ తీవ్రంగా ఉన్న రోజుల్లో మజ్జిగ, రస్నా వంటి వాటిని వితరణ చేస్తున్నట్టు తెలిపారు.

గైట్‌కు నాక్ ఏ డబుల్ ప్లస్ గుర్తింపు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలకు 3వ కాన్సిక్యూటివ్ సైకిల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ లభించిందని ఎండీ కె.శశికిరణ్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నాక్ పీర్ టీమ్ గత నెల 27, 28 తేదీలలో కళాశాలను సందర్శించి, బోధన, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ గుర్తింపు లభించిందన్నారు. 2013లో నాక్ ఏ గ్రేడ్‌ను, 2018లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్‌ను అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇందంతా సమష్టి కృషితోనే సాధ్యమైందంటూ బోధన, బోధనేతర సిబ్బంది సేవలను ప్రశంసించారు.

విద్యార్థులకు వ్యాసరచన, పద్య పోటీలు

రాజానగరం: ఉగాది విశిష్టతను తెలియజేస్తూ, ప్రస్తుత తరానికి ఆ పండగపై మక్కువను పెంచే విధంగా దివాన్ చెరువులోని ఉగాది సేవా సంస్థ విద్యార్థులకు వ్యాస రచన, పద్య పోటీలు నిర్వహించింది. అదే గ్రామంలోని దూడల సూరన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఈ పోటీలకు అపూర్వ స్పందన లభించింది. రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని, వ్యాసాలు రాశారు, పద్యాలు చదివారు. మన సంస్కృతి, సంప్రదాయాలపై భావితరాలకు ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

కిక్ బాక్సింగ్ విజేతకు నగదు బహుమతి



దినేష్‌కు నగదు బహుమతి అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి సీహెచ్ దినేష్‌కు రూ.20 వేలు, సర్టిఫికెట్‌ను వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం అందజేశారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీలలో కిక్ బాక్సింగ్ అథ్లెట్ 81 కిలోల విభాగంలో దినేష్‌కు ప్రతిభ చూపాడు. ఈ విద్యార్థి రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు.

వైభవంగా నూకాలమ్మ తీర్థం

రాజానగరం: గ్రామ దేవత నూకాలమ్మ వారి జాతర, తీర్థం సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముంగిట ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ముందు రోజు రాత్రి గ్రామంలో జాతర ఘనంగా జరిగింది.

పన్ను చెల్లింపుపై రాయితీ

రాజమహేంద్రవరం సిటీ: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరంలోని ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులను ఏకమొత్తంగా ఈనెల 30వ తేదీలోపు చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ ఇవ్వనున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ సోమవారం తెలిపారు. దీనిని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలన్నారు. చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి



కలవచర్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన
- ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో పేదలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించారని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని నందరాడ, నరేంద్రపురం, కలవచర్ల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సందర్శించి, కూలీలతో కొద్దిసేపు మమేకమయ్యారు. ఐదేళ్ల జగనన్న పాలన ఏవిధంగా ఉంది, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, సమస్యలేమైనా ఎదరయ్యాయా, మరోసారి జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారా అని ఆరా తీశారు. అన్నింటికీ వారు జై కొడుతూ మా ఇంటి పెద్ద బిడ్డ జగన్, ఆయన వస్తేనే మా బతుకులు బాగుంటాయంటూ ముక్తకంఠంతో బదులిచ్చారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తాం, సంక్షేమ పథకాలను అందుకుంటామంటూ తమ భావాలను తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, నాయకులు గంధం నారాయణరావు, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, పంపన శ్రీను, వడ్డి చిన్న, దాట్ల రఘువర్మ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుస్తాం



పల్లకడియంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

- స్పష్టం చేసిన పల్లకడియం వాసులు
- డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ ఎన్నికల ప్రచారం

రాజానగరం: పేద ప్రజల బాగోగులు చూసే జగనన్న ప్రభుత్వానికి తమ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని, ఆయనే మరోసారి ముఖ్యమంత్రి అవుతారని మండలంలోని పల్ల కడియం వాసులు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ సోమవారం పల్ల కడియంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళలు ఎదురొచ్చి మరీ స్వాగతం పలికారు. మీ మామయ్య జక్కంపూడి రామ్మోహనరావు, నీ భర్త జక్కంపూడి రాజా తమపై ఎనలేని ప్రేమాభిమానాలు చూపించారని, కష్టం వచ్చిందంటే చాలు మేమున్నమనే భరోసానిచ్చారన్నారు. ఈసారి ఎన్నికలలో కూడా జక్కంపూడి రాజా ఎమ్మెల్యేగా ఘన విజయం సాధిస్తారని, జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవుతారంటూ ఆశీస్సులు అందజేశారు. మా ఓట్లన్నీ ఫ్యాను గుర్తుకే వేస్తాం, సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుస్తాం, జగనన్నను మరోసారి అధికారంలోకి తీసుకువస్తామంటూ నినాదాలు చేశారు.

హిందీ టాలెంట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మోడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రంగంపేట: హిందీ టాలెంట్ పరీక్షలో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్టు గ్లోబల్ విజన్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని సత్యవాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ భాషా ప్రాముఖ్యతతో పాటు భాషా ప్రావీణ్యంను సంపాదించడానికి పలు పరీక్ష పోటీలకు తమ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం భారతీయ సమతా హిందీ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ పరీక్షలో తమ స్కూల్ తరపున 29 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరడంతో పాటు సిల్వర్ మెడల్స్, ప్రశంసాపత్రాలు సాధించినట్టు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ జాన్ డీన్ అభినందించారు.

సారా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీతానగరం: మండలంలోని అచ్చయ్యపాలేనికి చెందిన చిక్కాల రాంబాబును సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారని ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. అతడిని చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చయ్యపాలెం శివారున పట్టుకున్నామన్నారు. 80 లీటర్ల సారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆధునిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు



నందరాడలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతిలతో కలసి మండలంలోని రాజానగరం, శ్రీకృష్ణపట్నం, కోరుకొండ మండలం దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, కోటికేశవరంలలో రైతు కమతాలను సోమవారం సందర్శించారు. పంట దిగుబడులను కాపాడుకోవడంలో భాగంగా కోతుల బెడదను నివారించేందుకు సోలార్ కంచెను, ఎలుకల నుండి రక్షణకు ఎర – తెరను ఉపయోగించాలని సూచించారు.

ఘనంగా కాండ్రేగుల నూకాలమ్మ తీర్థం



నూకాలమ్మను దర్శించుకుంటున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: కాండ్రేగులలో కొలువైన నూకాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన నూకాలమ్మ తీర్థానికి జిల్లా నలుమూల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి నాలుగు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోడానికి బారులు తీరారు. మొక్కుల చెల్లించుకున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంగాణంలో భక్తులు వేచి ఉండడానికి ఏర్పాట్లు చేశారు. అలాగు స్థానికులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తీర్థంలో ఏర్పాట్లను పర్యవేక్షించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు, ఈఓ వి.శివబాబు, ప్రత్యేక అధికారి వీరభద్రరావు, తెలిపారు. ఉత్సవ కమిటీ, గ్రామ యూత్ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించడానికి అందరు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలో నూకాలమ్మ వారి తీర్థం సందర్భంగా సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంటకరమణ, నియోజకవర్గం ఎస్సీ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరివాసు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తీర్థం

బిక్కవోలు: గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి జాతరలో గరగనృత్యాలు, తీన్ మార్ డప్పులతో వివిధ వేషధారణలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారి నైవేద్యాలు సమర్పించుకున్నారు. భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కుబడి తీర్చుకున్నారు.అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం కమిటీ సభ్యులు, వైఎస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీయే అందరి లక్ష్యం



పుణ్యక్షేత్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఐదేళ్లుగా అందించిన సంక్షేమాన్ని గుర్తు చేద్దాం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలవడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచించారు. మండలంలోని జి.యర్రంపాలెం, పుణ్యక్షేత్రం గ్రామాలలో స్థానిక పార్టీ నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి, గడచిన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఒకసారి గుర్తు చేస్తూ, సమస్యల పరిష్కారంలోను, అభివృద్ధిలోను స్థానికంగా చూపిన శ్రద్ధను కూడా వివరించాలన్నారు. ఫ్యాన్ గుర్తు తప్ప వేరొక గుర్తు వారి మదిలోకి కూడా రాకుండా ఓటర్లను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం వెలగపూడి సచివాలయం నుంచి తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లా ప్రగతిని తెలియజేస్తూ వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఏడాదికి 30 లక్షల పని దినాల లక్ష్యం నిర్దేశించారన్నారు. అమృత్ సరోవర్ కింద 198 పనులను ప్రతిపాదించామని, ఫార్మ్ పాంట్ కింద 1800 లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 255 పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కింద 110 పనులకు 75 మంజూరు చేశామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కడియం: ఇటీవల గ్రామంలో జరిగిన జాతర సందర్భంగా కడియపుసావరంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆయా వర్గాలకు చెందిన యువకులు రోడ్లపైకి వచ్చి ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు చెందిన యువకులను చెదరగొట్టారు. కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మాట్లాడుతూ గ్రామంలోని మూడు చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని, ఇరువర్గాలకు చెందిన వారితో చర్చించామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున యువకులు నిబంధనలు మీరకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ దాడులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మంగళవారం గ్రామంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించండి



నల్లమిల్లిలో కార్మికుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ ఆయన గెలిపించుకోవాలని, ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లమిల్లి గ్రామంలోని రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులను కలుసుకుని వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తులకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని సంక్షేమం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతుందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మీ అందరికీ మంచి జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయ్యాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయనీ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని కార్మికులు తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి గ్రామ సర్పంచ్ నల్లా పద్మా దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బూరుగుపూడి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మధురపూడి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వాహనాల తనిఖీ ముమ్మరంగా సాగుతోంది. కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో సోమవారం రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కండే శ్రీనివాసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నగదు, సారా, గంజాయి తదితర వాటి రవాణాను అడ్డుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. నార్త్‌జోన్ పరిధిలో బూరుగుపూడి జంక్షన్‌తో పాటు రాజానగరం మండలం తూర్పు గానుగూడెం, ఏజెన్సీ ముఖద్వారం గోకవరం శివారున చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. తూర్పుగానుగూడెం చెక్‌పోస్టు వద్ద 22 కేజీల గంజాయిని కూడా పట్టుకున్నట్టు తెలిపారు. తనిఖీల్లో ఇప్పటివరకూ ఎక్కడా నగదు దొరకలేదన్నారు. డీఎస్పీ వెంట కోరుకొండ ఎస్సై డి.ఆనంద కుమార్ తదితరులు ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా



మర్రిపూడిలో రాజీనామా పత్రాలను డిజిటల్ అసిస్టెంట్ బాలకృష్ణకు అందజేస్తున్న వలంటీర్లు

రంగంపేట: ప్రతిపక్షాల ఆరోపణలకు మనస్తాపం చెంది మర్రిపూడి గ్రామంలో పని చేసే పది మంది వలంటీర్లు సోమవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పత్రాలను స్థానిక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ బాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామా సమర్పించిన వలంటీర్లు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటీర్లగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్రజలకు సేవలు అందించామన్నారు.

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటకు చెందిన ఆరుగురు గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా లేఖలను ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు తమపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేశామన్నారు. ఈ గ్రామంలో 15 మంది వలంటీర్లు ఉండగా, వారిలో 9 మంది ఈనెల ఆరున రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఎంపీడీవో మాట్లాడుతూ వీరిలో కలిపి ఆ గ్రామంలో మొత్తం వలంటీర్లందరూ రాజీనామా చేశారన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



ముత్యాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: కొప్పవరంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఏటా ఫాల్గుణ మాసంలో బహుళ చతుర్దశి రోజు రాత్రి అమ్మవారి జాతర, అమావాస్యను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సోమవారం రాత్రి తీర్థం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం గుర్రమంద గ్రామలో కొలువుతీరిన కాశీవిశ్వనాథస్వామిని, పూతిగుంట గ్రామంలోని ఊబలింగేశ్వర స్వామిని ఎమ్మెల్యే దంపతులు దర్శించి పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నియోజకవర్గంలోని బిక్కవోలు మండల బలభద్రపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేడపాటి ఆనంద రెడ్డి విశ్వనాథ స్వామి, ఊబలింగేశ్వర స్వామి వారికి మొక్కుకున్నారు. దీంతో ఆనందరెడ్డి, కుటుంబ సభ్యుల మొక్కు తీర్చడంలో భాగంగా ఎమ్మెల్యే దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్ రెడ్డి, మాజీ సర్పంచి తాడి సూరారెడ్డి, ఉపసర్పంచి మల్లిడి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, పలువురు ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: 2024–25 ఏడాదికి నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఆరోగ్య కార్యక్రమంపై సోమవారం పర్యవేక్షకులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు వందశాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతినెలా సుమారు పది ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసే అన్ని సమావేశాలలోనూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ కార్యక్రమాలకు సంబంధించి పోర్టల్స్‌పై శిక్షణ ఇచ్చారు.